

నందనందనా గోవింద

గోవింద.. హరి గోవింద.. నందనందన గోవింద అంటూ ఆ ఏడుకొండల స్వామిని భక్తజనం కొలిచింది. హోరు వర్షంలోనూ ఆధ్యాత్మికత వెల్లివిరిసింది




ఫొటోలకు ఫోజులిచ్చి..

ఒకప్పుడు ఇంటికెళ్లి... తలుపు తట్టి మరీ వలంటీర్లు పింఛన్లు అందించేవారు. ఇది వృద్ధులు, వితంతువులు తదితర లబ్ధిదారులకు ఎంతో ఊరటనిచ్చేది.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 3,17,980 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులుగా ఉంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

మూడో బెటాలియన్ కమాండెంట్‌గా జాన్



శామ్యూల్ జాన్

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పి.శామ్యూల్ జాన్‌ను ప్రభుత్వం శనివారం నియమించింది. పదోన్నతిపై కమాండెంట్‌గా శుక్రవారం నియమితులైన పిట్టా సోమశేఖరరావు శనివారం సాయంత్రం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో శ్రీకాకుళంలో ఒకటో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న శామ్యూల్ జాన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీజీపీ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది.

రత్నగిరికి రూ.20.06 కోట్ల 'ప్రసాదం'!

సాక్షి కథనంపై స్పందించిన అధికారులు



అన్నవరం దేవస్థానం

అన్నవరం: రత్నగిరిపై భక్తులకు వసతి కల్పించేందుకు ఉద్దేశించిన ప్రసాద్ పథకం అమలుపై కేంద్ర టూరిజం శాఖ అధికారుల్లో కదలిక వచ్చింది. ఈ పథకం కింద త్వరలో రూ.20.06 కోట్లు మంజూరు చేయడానికి ప్రయత్నాలు సాగుతున్నట్టు రాష్ట్ర టూరిజం శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'అన్నవరానికి ప్రసాద్‌ం దక్కేనా' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆ నిధులతో అన్నదాన భవనం, భక్తుల క్యూ లైన్‌ల కాంప్లెక్స్, టాయిలెట్స్ తదితర నిర్మాణాలతో పాటు, బ్యాటరీ వాహనాలను ఈ పథకంలో చేర్చారు. త్వరలో ఆయా నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ పరిశీలనకు అధికారులు సమావేశమై టెండర్లు పిలవనున్నట్టు వారు తెలిపారు. గతంలో ఆమోదించిన రూ.20.06 కోట్లుతో పాటు మరో రూ.ఐదు కోట్లు అదనంగా కేటాయించే అవకాశం ఉందని తెలిపారు.

ఇతర పార్టీలకు అమ్ముడుపోవడం సరికాదు

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురం టౌన్: గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో చట్టసభల్లో పదవులు అనుభవించిన కొందరు ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇప్పుడు వెన్నుపోటు ధోరణితో ఇతర పార్టీలకు అమ్ముడుపోవడం సరికాదని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఇలా వెన్నుపోటు పొడిచిన వారు పచ్చని తోటలో కలుపు మొక్కలపై వాలే మిడతల్లాంటి వారని అన్నారు. అమలాపురంలో ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మవిశ్వాసమే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపిస్తుందని గుర్తు చేశారు. జగన్ ఇచ్చిన ప్రోత్సాహాన్ని మరిచి మూలాలను, ఆదరణను విడిచి నేడు పార్టీ నుంచి వెళ్లిపోవడం వారి కుసంస్కారానికి నిదర్శమన్నారు. ఇలాంటి వెన్నుపోటు దారులు ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రమాదకారులేనని అన్నారు. ఇలాంటి ఎంపీలు, ఎమ్మెల్సీల వల్ల పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. ఏ ఎండకా గొడుగు పట్టే ఇలాంటి వారికి తగిన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పార్టీ పట్ల విధేయత అంటే రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర కూడా వెన్నుపోటు ఎంపీలు, ఎమ్మెల్సీల స్వార్థ ప్రయోజనాలు, అవకాశవాదాన్ని తీవ్రంగా ఖండించారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు నామినేషన్లు పూర్తి చేయండి

డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇన్‌స్పైర్ మనక్ 2024–25 విజ్ఞాన ప్రదర్శనకు నామినేషన్లను త్వరగా పూర్తిచేయాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్, రెసిడెన్షియల్, ఆదర్శ, కస్తూర్బా, కేంద్రీయ, నవోదయ, ప్రైవేటు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ఈ అంశంపై దృష్టి పెట్టాలన్నారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 15వ తేదీ తుది గడువని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల నుంచి ఆరు, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 3 ప్రాజెక్టులను విధిగా పంపాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూను 94903 51351 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

చక్షోత్సవం



- జిల్లాలో కొనసాగుతున్న నేత్రదాన పక్షోత్సవం
- అంధత్వ నివారణే లక్ష్యంగా నేత్రదాన ప్రోత్సాహం
- జిల్లాలో రెండు కార్నియా కలెక్షన్ పాయింట్లు, ఒక ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్
- నేత్రదాన ప్రాధాన్యం, అపోహలపై విశేష ప్రచారం
- మూడేళ్లలో 946 మంది అంధులకు చూపు
- జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ

కాకినాడ క్రైం: ఎన్నెన్నో అందాలు.. మరెన్నో వింతలు, విశేషాలు.. అమ్మ మొదలు ఎందరో ఆత్మీయుల అనురాగాలు.. ఇలా ఎన్ని భావాలను, దృశ్యాలను ఆస్వాదించాలన్నా కళ్లు ప్రధానం. కళ్లు మురిసిపోయే కళలెన్నో, కనిపించిన ప్రతి దృశ్యాన్ని జీవిత కాలపు మాధుర్యాలై, జ్ఞాపకాలై కట్టిపడేస్తాయి. ఈ అనుభూతులు, అనుభవాలన్నీ కేవలం వినికిడికో తాకిడికో పరిమితమైన ఎన్నో జీవితాలు అగమ్య గోచరాల్లో మగ్గిపోతున్నాయి. చూడగలిగే అదృష్టం దేవుడు వారికివ్వకపోవడం వారి దుస్థితికి కారణం. అటువంటి వారి జీవితాలలో వెలుగులు నింపేందుకు ఉన్న ఏకైక మార్గం నేత్రదానం. నేత్రదాన ప్రయోజనాన్ని విస్తృతం చేసి దాతల్ని ప్రోత్సహించడంతో పాటు నేత్రదానంపై నెలకొన్న అపోహలను చెరిపేసేందుకు నిర్దేశించిందే 'జాతీయ నేత్రదాన పక్షోత్సవం' పేరున కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ఇదీ లక్ష్యం...

అంధకారాన్ని అంతమొందించడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యమని జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పి.వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. నేత్రదాన ప్రాధాన్యాన్ని వివరించి దాతలను నమోదు చేయడం, అలాగే కంటి పరీక్షలు చేసి చూపు సరిచేసే వైద్యం అందించడం. ఉచిత కళ్లజోళ్ల పంపిణీ, కార్నియా ఇంప్లాంటేషన్ చేయడం ఇందులో భాగమని తెలిపారు. అలాగే చదువుకుంటున్న విద్యార్థుల్లో కంటి చూపు సమస్యలు నివారించేందుకు అవగాహన తరగతులు నిర్వహించి ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తామని, అలాగే చూపు మందగించిన వారికి అర్హత సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్టు తెలిపారు.

21 మండలాలలో...

జిల్లాలోని 21 మండలాలలో ఆరుగురు ఆప్తాల్మిక్ ఆఫీసర్లు నేత్రదాన వారోత్సవ విధుల్లో ఉన్నారు. వీరు దశల వారీగా నిర్దేశించిన విధులను పూర్తి చేస్తారు. నేత్రదానాలకు వీరికి లక్ష్యాలను నిర్దేశించారు. అలాగే అవగాహన కార్యక్రమాల అంశాలు, కంటి వైద్య పరీక్షల విశేషాలను వీరు ప్రోగ్రాం మేనేజర్‌కి నివేదిస్తారు. వీరు కాక, ఐ బ్యాంక్, ఇంప్లాంట్ సెంటర్లకు చెందిన సుమారు 20 మంది నేత్రదాన ప్రక్రియలో పనిచేస్తారు.

సేకరణ 2 చోట్ల.. అమరిక ఒక చోట..

జిల్లాలో కార్నియా సేకరణకు రెండు సంస్థలు పనిచేస్తున్నాయి. అవి బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్, రెడ్ క్రాస్ ఐ బ్యాంక్‌లు. వీరు తొలుత దాత నుంచి నేత్రదాన ప్రమాణాన్ని అందుకుంటారు. దాత మరణానంతరం కుటుంబ సభ్యుల సమాచారంతో మృతదేహం నుంచి కంటి నల్లగుడ్డు పై పొరను సేకరిస్తారు. అలాగే, కార్నియాను అమర్చే సదుపాయం శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రిలో ఉంది. సేకరించే రెండు యూనిట్లు, అమర్చే ఒక ఇంప్లాంట్ సెంటర్ జిల్లాలో కాకినాడలో మాత్రమే ఉన్నాయి.

కళ్లు చెక్కు చెదరవు...

గతంలో నేత్రదానం చేసే వారి కళ్లను పూర్తిగా తొలగించేవారని దీంతో దాతలు ముందుకు వచ్చినా మరణానంతరం కుటుంబ సభ్యుల అంగీకారం ఉండేది కాదని బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. గుంతలు పడ్డ కళ్లతో తమ వారి విగత దేహాలను చూస్తూ చలించిపోయే వారని అప్పటి పరిస్థితిని వివరించారు.

ప్రయోజనాలు – అపోహలు

నేత్రదానం వల్ల ప్రయోజనాలు అనేకం ఉంటే, దాతలను నిరుత్సాహపరచడానికి కొన్ని అపోహలు కూడా పుట్టుకొచ్చాయని డాక్టర్ పీవీ ప్రసాద్ తెలిపారు. 'చనిపోయినా చూస్తుంటారు..' అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒకరి నేత్రదానం ఇద్దరికి కంటి చూపును ప్రసాదిస్తుందని అన్నారు. కార్నియాను గ్రహించే వారు మృతి చెందిన వ్యక్తికి ఉన్న అన్ని జబ్బులకు గురవుతాడన్న ప్రచారం పూర్తి అవాస్తవం అన్నారు. కార్నియాను పూర్తిగా ప్యూరిఫై చేసిన తర్వాతే అమరుస్తారన్నారు. అలాగే దాత ఆరోగ్య స్థితి ఎటువంటిదైనా కార్నియా సేకరణ, ప్యూరిఫికేషన్ అనంతరం ఆరోగ్య స్థితిని ఐ బ్యాంక్‌లు గోప్యంగా ఉంచుతాయని డాక్టర్ ప్రసాద్ అన్నారు.

30 శాతం కార్నియాలు వృథా

కార్నియా సేకరణ తర్వాత కనీసం 30 శాతం వృథా అవుతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకు కారణం దాతల్లో తలెత్తే వివిధ ఆరోగ్య సమస్యలని వెల్లడించారు. అలాగే మృతి చెందిన ఆరు గంటలలోపు కార్నియా సేకరించకపోయినా వృథా అయినట్లేనని తెలిపారు. మిగిలిన 70 శాతాన్ని తగిన రీతిలో ప్యూరిఫై చేసి గ్రహీతకు అమరుస్తారని తెలిపారు. అలాగే కార్నియా వ్యక్తికి 20 ఏళ్ల వయసు వచ్చే వరకు ఎదుగుతుందని చెబుతూ 20 ఏళ్లు పైబడిన వారు ఎవరైనా నేత్రదానానికి ప్రమాణ పత్రాన్ని ఇవ్వొచ్చని అన్నారు.



కార్నియాను సేకరిస్తున్న బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ నిపుణులు



నేత్రదాన ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

946 మంది అంధులకు చూపు

నేత్రదానం వల్ల గడచిన మూడేళ్లలో 946 మందికి చూపు దక్కింది. వీరు అంతకుముందు పూర్తి అంధులు. చీకటి తప్ప ప్రపంచం కనిపించని దుస్థితి వీరిది. దాతలు గ్రహీతల గణాంకాలివీ...

ఆర్థిక సంవత్సరం	కార్నియాల సేకరణ	లబ్ధి పొందిన గ్రహీతలు
2021–22	268	190
2022–23	498	387
2023–24	536	369



వారోత్సవాలలో భాగంగా పాఠశాలలో బాలుడికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్

జాతీయ స్థాయిలో పర్యవేక్షణ



39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు గత నెల 25న మొదలై ఈ నెల 8వ తేదీ వరకు జరగనున్నాయి. వారోత్సవాల్లో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా స్ఫూర్తి పొంది వారం రోజుల్లో 403 మంది స్వచ్ఛందంగా నేత్రదానానికి తమ అంగీకారాన్ని తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్లుగా కలెక్టర్, డీఎంహెచ్‌వోలు వ్యవహరిస్తుండగా వారోత్సవాల నిర్వహణపై కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని అంధత్వ నివారణ విభాగం పర్యవేక్షిస్తోంది. ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు ప్రత్యేక బ్యానర్, పోస్టర్, కరపత్రాల రూపకల్పన జరిగింది. వాటిని కలెక్టర్ ఆవిష్కరించారు. వీటి ద్వారా నేత్రదాన ప్రయోజనాన్ని ప్రజలకు వివరిస్తున్నాం. వారోత్సవాల ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి ప్రజలు స్థానిక ఆరోగ్య ప్రభుత్వ కేంద్రంలోని వైద్యాధికారిని సంప్రదించాలి. బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్, రెడ్‌క్రాస్ ఐ బ్యాంకులు నేత్రదానానికి ఎంతగానో దోహదపడుతున్నాయి.

– డాక్టర్ పీవీ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆప్తల్మాలజీ, ఆర్ఎంసీ, కాకినాడ, అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్ కాకినాడ జిల్లా

పంపా పరవళ్లు

- 98.5 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఆదివారం ఉదయానికి 101 అడుగులకు చేరే అవకాశం
- రిజర్వాయర్‌లోకి వస్తున్న 400 క్యూసెక్కుల నీరు

అన్నవరం: బంగాళాఖాతంలో వాయుగుండం వల్ల గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నవరంలోని 'పంపా' రిజర్వాయర్ నిండు కుండలా దర్శనమిస్తోంది. ఫలితంగా నీటిమట్టం శనివారం సాయంత్రానికి 98.5 అడుగులకు చేరుకుంది. పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల రిజర్వాయర్‌లోకి 400 క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ఆదివారం ఉదయానికి పంపా నీటిమట్టం 101 అడుగులకు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్తగా బ్యారేజీ రెండో నెంబర్ గేటు ద్వారా 70 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తునట్లు పెద్దాపురం ఇరిగేషన్ డివిజన్ ఈఈ శేషగిరిరావు శనివారం తెలిపారు. పంపా ఆయకట్టుకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సబ్సిడరీ డ్యామ్ ద్వారా పది క్యూసెక్కులు, పుష్కర కాలువ ద్వారా 70 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పంపా గరిష్ట నీటి నిల్వ 0.43 టీఎంసీ కాగా, ప్రస్తుతం 0.27 టీఎంసీ నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు.



వర్షపు నీటితో నిండుకుండలా కనిపిస్తున్న పంపా రిజర్వాయర్

ముంచెత్తిన వాన



జలమయమైన గొల్లప్రోలు మెయిన్ రోడ్డు



చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచిస్తున్న ఎఫ్‌డీఓ నూకరాజు తదితరులు

- మెట్ట ప్రాంత పంటలకు మేలు
- వరికీ నష్టం లేదంటున్న అధికారులు

కాకినాడ సిటీ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పొలాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు. ఉద్యాన వన, మెట్ట ప్రాంతాల పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ వారం, పది రోజుల్లో నాటిన వరినాట్లకు కొంత మేర ఇబ్బందులు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ 18004253077 ఏర్పాటు చేసి రోజుకు ముగ్గురు సిబ్బందిని 24 గంటలు సమాచారం సేకరించేందుకు మూడు షిఫ్టులుగా నియమించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు అందాయి. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు టాంటాం వేయిస్తున్నారు.


56.3 మిల్లీ మీటర్ల వర్షపాతం

జిల్లాలో సరాసరిన 56.3 మిల్లీ మీటర్ల వర్షం నమోదు కాగా శంఖవరంలో గరిష్ఠంగా 84 మిల్లీ మీటర్ల వర్షం పడింది. తొండంగి 82.6, పిఠాపురం 75.2, ఏలేశ్వరం 67, తుని 65, రౌతులపూడి 64, గండేపల్లి 63, యు.కొత్తపల్లి 59.6, కాకినాడ అర్బన్ 55.4, కాకినాడ రూరల్ 54.2, కిర్లంపూడి 53.2, కోటనందూరు 52.2, కరప 49.8, జగ్గంపేట 49.4, గొల్లప్రోలు 48.4, కాజులూరు 47.8, పెదపూడి 46.8, ప్రత్తిపాడు 44.8, తాళ్లరేవు 43.8, పెద్దాపురం 42.8, సామర్లకోట 33.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.


కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

కాకినాడ సిటీ: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం తెలిపారు. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో, జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు, మండల తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఎప్పటికప్పుడు తగు సూచనలు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జూనియర్ అసిస్టెంట్ పి.దుర్గాప్రసాద్ 9398055733, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి గంటల వరకు సీనియర్ అసిస్టెంట్ పి.సత్యశ్రీకాంత్ 8885391239, రాత్రి 8 నుంచి ఉదయం 7 గంటల వరకు జూనియర్ అసిస్టెంట్ డి.సత్తిరాజు 94922993 నంబర్లలో అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బంది ఏర్పడినా రోడ్లు తెగినా, చెట్లు కూలినా, ట్రాఫిక్ ఇబ్బంది కలిగినా టోల్‌ఫ్రీ నంబర్లకు గాని కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది ఫోన్ నంబర్లకు గాని ఫోన్ చేసి తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. అలాగే ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పైరవీలకు మరో పక్షం!



- బదిలీలకు 15 రోజులు పొడిగించిన ప్రభుత్వం
- నేతల చుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణలు
- ఇప్పటికే సిఫారసులు తీసుకున్న వారిలో కలవరం



కాకినాడ సిటీ: కోరుకున్న చోటకు వెళ్లేందుకు కొందరు.. ఉన్న చోటే పాతుకుపోయేందుకు మరి కొందరు ఉద్యోగులు ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. తాజాగా ప్రభుత్వం బదిలీలకు గడువు పెంచడంతో ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. తాము కోరుకున్న ప్రదేశానికి ఎవరు పోటీ వస్తారో, మ్యూచువల్‌కు గతంలో అంగీకరించిన వారు, మళ్లీ ఎక్కడ మనసు మార్చుకుంటారోనని ఆందోళన చెందుతూ ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే బదిలీ కోసం విఫలయత్నం చేసినవారు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ప్రత్యామ్నాయ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును మరో 15 రోజులు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సెప్టెంబర్ 15 వరకు నిషేధం ఎత్తివేయగా, 16 నుంచి బదిలీలపై నిషేధం అమలుల్లోకి రానుంది. ఇప్పటికే ఉద్యోగుల బదిలీల్లో జోరుగా పైరవీలు సాగుతున్నాయి. వాస్తవానికి ఆగస్టు 31తోనే బదిలీలకు తొలి గడువు కావడంతో ఇప్పటికే ఆశావహులు నేతలకు దక్షిణలు సమర్పించేసుకున్నారు.

మధ్యవర్తుల చేతివాటం

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే బదిలీలకు అవకాశం ఇవ్వడంతో తమ సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు ఉద్యోగులు నానా మార్గాలు వెతుకుతున్నారు. రాజకీయ నాయకులు, ఉద్యోగ సంఘాల నేతల చుట్టూ తిరుగుతున్నారు. విభజన తరువాత కాకినాడ జిల్లా నుంచి తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలకు అనేక మంది తప్పనిసరిగా బదిలీపై రావాల్సి ఉంది. ఈ క్రమంలో ఇటు నుంచి వెళ్లిన వారు సంఖ్య తక్కువగానే ఉంది. ఈ సారి అవకాశం రావడంతో ఎంత ఖర్చయినా పెట్టేందుకు వెనుకాడడం లేదు. బడా నేతలతో పాటు, వారి వ్యక్తిగత సహాయకులుగా ఉంటున్న కొందరు బదిలీల కోసం వచ్చే ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ప్రధానంగా వీఆర్వో, రెవెన్యూ, పోలీస్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ విభాగాల్లో బదిలీలకు డిమాండ్ ఉంది. ఇప్పటికే తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ సీఐ, ఎస్ఐ, వీఆర్వో స్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన వారితో భర్తీ చేసుకున్నారు. గత ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారన్న అపవాదు ఉన్నా చాలు.. దూరంగా విసిరేస్తున్నారు. మిగిలిన పోస్టుల్లోనూ తాము చెప్పినట్లు నడుచుకుంటేనే లేఖలు ఇస్తామని ముందుగానే షరతులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

పలుకుబడి ఉన్నవారిదే రాజ్యం

గతంలో బదిలీల ప్రక్రియ కౌన్సెలింగ్ ద్వారా జరిగేది. ప్రస్తుతం సిఫారసు లేఖలకే ప్రాధాన్యం ఉండడంతో పలుకుబడి ఉన్నవారికే కోరిన ప్రదేశానికి బదిలీ అవుతోంది. సాధారణ ఉద్యోగులకు న్యాయం జరగడం లేదు. ఏ మాత్రం పలుకుబడి లేక చాలా మంది ఉద్యోగులు కుటుంబాలకు దూరంగా ఏళ్ల తరబడి ఉద్యోగాలు చేస్తూ నెట్టుకొస్తున్నారు.

విద్యుత్ శాఖలో జోరుగా పైరవీలు

విద్యుత్ శాఖకు సంబంధించి బదిలీల కోసం జోరుగా పైరవీలు సాగుతున్నాయి. రూ.లక్షలు పట్టుకుని ఎమ్మెల్యేల చుట్టూ డీఈ స్థాయి నుంచి కింది స్థాయి వరకు ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విభాగంలో ఐదేళ్లు దాటిన వారిని కచ్చితంగా బదిలీ చేయాల్సి ఉంది. శతశాతం పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రిక్వెస్ట్ బదిలీలకు కూడా ఏడాది కాలం పూర్తి కావాలి. ఏఏవోకు దిగువన ఉన్న సిబ్బంది బదిలీల విషయం ఎస్ఈకే అధికారాలిచ్చారు. విద్యుత్ శాఖలో చాలా మంది అధికారులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. ఒక వేళ వెళ్లాల్సి వచ్చినా డిప్యూటేషన్‌పై పట్టణ ప్రాంతాలకు వచ్చేస్తున్నారు. ఇంజినీరింగ్ స్థాయి నుంచి జేఎల్ఎం వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఎవరూ ఉండడం లేదు. దీని వల్ల వినియోగదారులకు సరైన సేవలు అందడంలేదు. ప్రతి ఒక్కరూ కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం వంటి పట్టణాల నుంచి రాకపోకలు చేస్తున్నారు. చాలా మంది అధికారులు సెల్ ఫోన్ ద్వారానే విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఎక్కువగానే వినిపిస్తున్నాయి. జేఎల్ఎంలు లోకల్ ఎలక్ట్రీషియన్లపైనే ఆధారపడుతున్నారు. దీని వల్ల వినియోగదారులకు డబ్బు చెల్లించనిదే పని అవ్వడం లేదు. విద్యుత్ శాఖలో ఒకే చోట 15 ఏళ్లు పైబడి పని చేస్తున్నవారు సైతం సర్కిల్ కార్యాలయంలో ఉన్నట్లు చెబుతున్నారు.

క్లుప్తంగా

మత్తులో దాడి.. నలుగురికి గాయాలు

తాళ్లరేవు: పిల్లంక ఏటిగట్టు రహదారిలో శనివారం రాత్రి ముగ్గురు యువకులు మత్తులో పలువురిపై దాడిచేసి గాయపరిచినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు యానాం బాలయోగి నగర్‌కు చెందిన పలివెల రాము, కొప్పాడి ఏసు, టిక్కిరెడ్డి శివశంకర్ అనే యువకులు మత్తులో పిల్లంక సమీపంలోని ఏటిగట్టు రహదారిపై దారి కాచి పలువురిపై దాడికి దిగారు. ఈ దాడిలో పిల్లంక గ్రామానికి చెందిన మండ మహేశ్వరరావు, అతని కుమారులు సంతోష్, కృష్ణలతో పాటు పితాని శ్రీరాములుకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా బాధితులు ఆత్మరక్షణార్థం చేసిన ఎదురుదాడిలో నిందిత యువకుల్లో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన బాధితుల్ని తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దాడికి పాల్పడిన యువకులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. అయితే సదరు యువకులు గంజాయి లేక మద్యం మత్తులో ఉన్నారో తేలాల్సి ఉంది.

19న నన్నయలో టెక్‌ఫెస్ట్



అద్విక 24 బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 'అద్విక 24' పేరిట జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో జరగనుందని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను యూనివర్సిటీలో శనివారం విడుదల చేశారు. పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్లు, టెక్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, షార్ట్‌ఫిల్మ్ మేకింగ్, ప్రజెంటేషన్ ఆఫ్ ఐడియా విత్ హైపోథిసిస్ డిబేట్ వంటి సాంకేతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనికి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు కన్వీనర్‌గా కాగా, డాక్టర్ జి.కీర్తి కో కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు.

దండుగా వచ్చి.. ఫొటోలకు ఫోజులిచ్చి

- పింఛను లబ్ధిదారుల స్వేచ్ఛకు భంగం
- కూటమి నేతలు మూకుమ్మడిగా వెళ్లి పంపిణీ
- ఈ తంతుపై సర్వత్రా అభ్యంతరాలు

అలమూరు: ఒకప్పుడు ఇంటికెళ్లి... తలుపు తట్టి మరీ వలంటీర్లు పింఛన్లు అందించేవారు. ఇది వృద్ధులు, వితంతువులు తదితర లబ్ధిదారులకు ఎంతో ఊరటనిచ్చేది. ఇలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీ ప్రతి నెలా ఒకటో తేదీనే సాఫీగా జరిగిపోయేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను హరించేలా పింఛన్ల పంపిణీ జరుగుతోంది. ఒక వీధిలో నిలబెట్టి, లేకుంటే దండుగా ఇంటింటికి వెళ్లి కూటమి నేతలు పింఛన్లు ఇస్తుండడం, ఆపై ఫొటోలకు ఫోజులిస్తుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లను కూటమి ప్రభుత్వం 2024 జూలై 1న పంపిణీ చేసింది. ఇందులో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి కనుక పార్టీ నేతలు, కార్యకర్తలను భాగస్వామ్యం చేసిందని అనుకోవచ్చు. అయితే ప్రతి నెలా పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో కూటమి నేతలు, తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పింఛన్లను పంపిణీ చేసే గ్రామ సచివాలయం, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బందికి తోడుగా కూటమి నేతలు ఇంటింటికీ వెళ్లి, లేకుంటే ఓ వీధిలోనూ పింఛన్లను అందజేశారు. కొంతమంది మహిళలు అంతమందిలో పింఛన్ సొమ్ము తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,41,354 మంది పింఛనుదారులు ఉండగా ప్రతి నెలా రూ.10.51 కోట్లు, కాకినాడ జిల్లాలో 2,76,693 మందికి రూ.11.64 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 2,39,964 మంది పింఛనుదారులకు రూ.10.23 కోట్లు అందజేస్తున్నారు.



పినపళ్లలో లబ్ధిదారునికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు



ఒకేచోట ముగ్గురికి పింఛను ఇచ్చి ఇలా ఫొటో తీసుకుని..

ఇదేం తీరు బాబూ..

ఏ ప్రభుత్వంలోనైనా కొత్తగా పథకాలు ప్రవేశపెట్టినప్పుడు సంబరాలు చేయడం ఆనవాయితీ. కానీ కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రతి నెలా పింఛన్ పంపిణీని హడావుడిగా నిర్వహిస్తుంది. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలంటూ ముఖం చాటేసిన ప్రభుత్వం ఈ పింఛన్లలో ఇలా ఆర్భాటం చేస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన అవకాశంతో కూటమి నేతలు తామేదో ఇంట్లోంచి తీసుకువచ్చి సొంత సొమ్మును ఇస్తున్నంత హడావుడి చేస్తున్నారు. కొన్నిచోట్ల తాము ఇస్తున్న పింఛన్ సొమ్ముతో పండగ చేస్కోండంటూ అవహేళన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు వాపోతున్నారు. ఈ విషయం బయటకు చెబితే పింఛన్‌ను ఎక్కడ ఆపేస్తారోనని లబ్ధిదారులు భయపడుతున్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో కూటమి నేతలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అంటున్నారు. జూలైలో కొత్త ప్రభుత్వం వచ్చాక ఆలమూరు మండలంలోని ఓ వైఎస్సార్ సీపీ నేతకు పింఛను ఇచ్చే సమయంలో ఫొటో తీయకపోతే పింఛన్ ఇచ్చేది లేదని కూటమి నేతలు చెప్పడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక ప్రదేశానికి రమ్మని అక్కడే పింఛన్లు ఇస్తున్నారు.

గతమెంతో ఘనం

గతమెంతో ఘనం అనే సామెత ఇప్పటి పరిస్థితిని తెలియజేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ఉదయాన్నే నేరుగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పింఛను సొమ్మును అందజేసేవారు. ఇదంతా ఎటువంటి ఆర్భాటాలు లేకుండా సాగిపోయేది. ఇప్పుడేమో గ్రామ సచివాలయ సిబ్బంది నుంచి పింఛన్ సొమ్మును లాక్కుని వారే సొంత సొమ్మును ఇస్తున్నట్లు కూటమి నేతలు ఫోటోలకు ఫోజులిస్తున్నారు. ఆ ఫోటోలను ప్రచార మాధ్యమాల్లో పెడుతున్నారు. ఇలా తమ వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్నారని పలువురు లబ్ధిదారులు విమర్శలు చేస్తున్నారు. పింఛనుదారుల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉంటారు. పింఛన్ల సొమ్మును గోప్యంగా అందించాల్సిన ప్రభుత్వం ఆర్భాటంగా ఇచ్చి ఫోటోలు తీయించుకోవడం వల్ల అనేక మంది ఇబ్బంది పడుతున్నారు.

నందనందనా గోవింద



ఆలయం వద్ద భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

- వాడపల్లికి భక్తజన సందోహం
- వర్షంలోనూ ఏడు ప్రదక్షిణలు

ఆత్రేయపురం: గోవింద.. హరి గోవింద.. నందనందన గోవింద అంటూ ఆ ఏడుకొండల స్వామిని భక్తజనం కొలిచింది. జోరున వర్షంలోనూ ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.. వాడపల్లి క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. కలియుగ దైవంగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రం భక్తులతో పోటెత్తింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడం, ఏడు శనివారాల నోము ఆచరించే భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి రావడంతో క్షేత్రం పరిసరాలు సందడిగా మారాయి. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా రద్దీ ఎక్కడా తగ్గలేదు. విశిష్ట, వీఐపీ, ఉచిత దర్శనాల క్యూ లైన్లు పోటెత్తాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనాలకు అనుమతి ఇచ్చారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. గౌతమీ గోదావరి వరద తాకిడి పెరగడంతో భక్తుల స్నానాలను నిలుపుదల చేశారు. షవర్ల ద్వారా స్నానాలకు అనుమతులు ఇచ్చారు. వర్షం కారణంగా ఆలయం బయట ప్రదక్షిణలు చేసే భక్తులు ఇబ్బంది పడ్డారు. షామియానాలు ఏర్పాటు చేసినా నీరు దిగడంతో తడుస్తూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. రేకుల షెడ్లు ఉంటే వర్షపు నీరు కిందకు దిగదు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉంటే ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

అమ్మో అధ్వానం

ఆత్రేయపురం నుంచి వాడపల్లి వరకూ ఉన్న కాలువ రోడ్డు వర్షంతో పూర్తిగా ఛిద్రమైంది. దీంతో స్వామివారి మొక్కులు చెల్లించుకునే కాలినడకన వచ్చే భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. భక్తులతో పాటు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ రోడ్డును ఆధునీకరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

మందపల్లి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



మందపల్లి శనైశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు చేశారు. శనికి ప్రీతికరమైన శనివారంతో పాటు ఈసారి అమావాస్య ముందు త్రయోదశి పర్వదినం కలసి రావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయం వెనుక షెడ్లలో పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్ష పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.21,41,370, ఆన్‌లైన్, పరోక్షపూజల ద్వారా రూ.5,29,200, అన్నప్రసాద విరాళాల రూపంలో రూ.47,500 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. ఇదిలా ఉంటే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పలువురు ప్రముఖులు స్వామివారికి పూజలు చేశారు.

కిటకిటలాడిన అప్పనపల్లి

మామిడికుదురు: అప్పనపల్లిలో కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయంలో జరిగిన శ్రీలక్ష్మీనారాయణ హోమాన్ని తిలకించారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.1,16,793 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు.

లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.78,380 ఆదాయం, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.38,413 సమకూరింది. 1,982 మంది భక్తులు రాగా, 1,504 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.



అప్పనపల్లిలో బాల బాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: బంగాళాఖాతంలో వాయుగుండంతో భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ తిలక్ కుమార్ శనివారం ప్రకటించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా, డివిజన్ స్థాయిలలో 24 గంటల పాటు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ తీగలను, తడిసిన విద్యుత్ స్తంభాలను, తడిగా ఉన్న విద్యుత్ పరికరాలను ప్రజలు నేరుగా తాకవద్దని విజ్ఞప్తి చేశారు. ఏదైనా విద్యుత్ అంతరాయం, సమస్యలు తలెత్తితే దగ్గరలోని విద్యుత్ సెక్షన్ ఆఫీసులో కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు.

ఫోన్ నంబర్లు

రాజమహేంద్రవరం సర్కిల్ – 73822 99960, 94906 10859
రాజమహేంద్రవరం టౌన్ డివిజన్ – 94906 10855
రాజమహేంద్రవరం రూరల్ – 73825 85487
కాకినాడ డివిజన్ – 94931 78718
పెద్దాపురం డివిజన్ – 94931 78728
జగ్గంపేట డివిజన్ – 94906 10097
అమలాపురం డివిజన్ – 94409 04477
రామచంద్రపురం డివిజన్ – 94931 78821, 08857–243082
రంపచోడవరం డివిజన్ – 89856 63114

కాలువలో పడి వ్యక్తి మృతి



బొండాడ రామకృష్ణ (ఫైల్)

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామంలోని కాలువలో ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై బి.శివకృష్ణ కథనం ప్రకారం.. మానేపల్లి గ్రామానికి చెందిన బొండాడ రామకృష్ణ (46) శనివారం కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. నాగుల్లంకలోని కాలువలో కాళ్లు శుభ్రం చేసుకుంటుండగా కాలుజారి పడిపోయాడు. అతను నీట మునిగిపోతూ కేకలు వేయడాన్ని గమనించిన స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికి రామకృష్ణ మృతదేహం లభ్యమైంది. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

తప్పుడు కేసు నుంచి రక్షించండి

రామచంద్రపురం రూరల్: తప్పుడు కేసు నుంచి తన కుమారుడిని రక్షించాలని కోరుతూ జిల్లా ఎస్పీకి రామచంద్రపురం మండలం తాళ్లపొలంకు చెందిన మహిళ కట్టా రమణ ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు వివరాలను శనివారం ఆమె విలేకరులకు తెలిపారు. ఆ వివరాలు ఇలా.. తన చిన్న కుమారుడు కట్టా అశోక్ (పండు) తాళ్లపొలం మెయిన్ రోడ్డులోని తమ స్థలాన్ని మెరక చేసుకునేందుకు కుడుపూడి శ్రీను (బొజ్జయ్య) వద్ద ఇసుకను కొనుగోలు చేశాడని రమణ తెలిపింది. తాము తిరుపతిలో ఉండగా, కొనుగోలు చేసిన ఇసుకను ఎవరో తీసుకుని వెళ్లిపోయారని చెప్పింది. దీంతో తమకు రూ.1.30 లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొంది. అయితే ద్రాక్షారామ హౌసింగ్–4 లేఅవుట్‌లో వేసిన ప్రభుత్వ ఇసుక దొంగతనానికి గురికాగా, దానిని దొంగల శ్రీధర్, వాసంశెట్టి చంద్రశేఖర్ (బాల)లు పట్టుకెళ్లినట్లు ఒప్పుకున్నారని, విలేకరులకు రామచంద్రపురం హౌసింగ్ ఏఈ కేవీ భాస్కరరావు వివరించారన్నారు. ఆ ఇసుక తరలింపు కేసులో పసలపూడికి చెందిన కర్రి గోవిందరెడ్డికి చెందిన 7 లారీలు, 3 జేసీబీలను ఉపయోగించినట్లు తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ కేసును రాజకీయ ప్రోద్బలంతో తమ కుమారుడిపైనా పెట్టారన్నారు. దీనిపై సీసీ కెమేరాల ఫుటేజీలను పరిశీలించి, తప్పుడు కేసు నుంచి తమ కుమారుడిని రక్షించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.